క్లుప్తంగా

కొత్త కార్యవర్గం ఎన్నిక



మండల త్రిరత్న బౌద్ధధమ్మ సొసైటీ సభ్యులు

కరప: వేళంగిలో త్రిరత్న బౌద్ధధమ్మ సొసైటీ వ్యవస్థాపకుడు, ధమ్మాచార్య పొలుగుబాటి నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల త్రిరత్న బౌద్ధధమ్మ సొసైటీ కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల త్రిరత్న బౌద్ధధమ్మ సొసైటీ అధ్యక్షుడిగా మాతా అప్పారావు, ఉపాధ్యక్షుడిగా మార్రెళ్ల రామకృష్ణ, కార్యదర్శిగా సాంబత్తుల రఘువర్మ, ట్రెజరర్‌గా ఇజ్జిన లోవరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సిద్దాబత్తుల అర్జున్, సభ్యులుగా డి.శ్రీనివాసరావు, కె.సూరిబాబు, జిల్లా శివకుమార్, వి.వెంకటేష్, అర్జున్ ఎన్నికయ్యారు. ముందుగా గిడ్ల వరప్రసాద్, సాదే వీరరాఘవులు బుద్ధుని చిత్రపటానికి పూలమాల వేసి బౌద్ధ వందనం చేశారు. సీటీఓ సాంబత్తుల వెంకట్రావు, విశ్రాంత పోలీస్ అధికారి పేరెళ్ల చంద్రరావు, రచయిత సవిలే రాజేష్, జక్కల ప్రసాద్‌బాబు, వినకోటి ధమ్మప్రసాద్, పినిపే నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వాక్‌థాన్



పరిసరాల పరిశుభ్రతపై వాక్‌థాన్ చేస్తున్న ఓఎన్జీసీ ఉద్యోగులు

బాలాజీచెరువు: స్వచ్ఛభారత్ వారోత్సవాల్లో భాగంగా ఓఎన్జీసీ ఆధ్వర్యంలో స్థానికంగా వాక్‌థాన్ నిర్వహించారు. తొలుత ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రత్నేష్‌కుమార్, సర్ఫేస్ మేనేజర్ ప్రభలేసెస్ గుప్తలు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. రాయుడుపాలెం, ఎస్ఆర్ఎంటీ మాల్, సర్పవరం జంక్షన్ మీదుగా సాగింది. పరిసరాల పరిశుభ్రత పాటించాలంటూ నినాదాలు చేశారు. అన్నవరం సత్యవతీదేవి కళాశాల విద్యార్థులు, ఓఎన్జీసీ ఉద్యోగులు పాల్గొన్నారు. ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరించారు.

పేదలకు చేయూత



విద్యార్థులకు చెక్కులు అందజేస్తున్న బాదం బాలకృష్ణ, ఉదయ్ శ్రీనివాస్

బాలాజీచెరువు: పూర్వ విద్యార్థులంతా కలసి ఏర్పాటు చేసుకున్న రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థుల చారిటబుల్ ట్రస్ట్ (1978) ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బాదం బాలకృష్ణ అన్నారు. స్థానిక దేవాలయం వీధిలోని కార్యాలయంలో ఆదివారం తొమ్మిది మంది పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఇద్దరు మహిళలకు మూడు నెలలకు సరిపడా మందులు కలిపి సుమారు రూ.2 లక్షల విలువైన సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వీటిని ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి జగన్నాథరావు, సభ్యులు సీమకుర్తి పాపారావు, బోడా ఆనంద్, రామ్‌చరణ్, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

మూఢాచారాలకు వ్యతిరేకంగా రచనలు

బోట్‌క్లబ్: సామాజిక ప్రయోజనాలు ఆశించి గుర్రం జాషువా రచనలు చేశారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. స్థానిక సత్కళావాహినిలో ఆదివారం గుర్రం జాషువా జయంతి వేడుకలు నిర్వహించారు. కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని మూఢాచారాలపై తిరగబడ్డారన్నారు. ఈ సందర్భంగా వేదుల శ్రీనివాసశర్మ, ఈవీ కృష్ణమాచార్యులు, కె.దుర్గాప్రసాద్ అవధానితో పాటు పలువురు కవులు గుర్రం జాషువా సాహిత్యాన్ని వివరించారు. అనంతరం కవులను సత్కరించారు. కార్యక్రమంలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ నాయకులు యార్లగడ్డ రామ్‌కుమార్, పైడా భవనప్రసాద్, మాలకొండయ్య, పెద్దిరెడ్డి రవికిరణ్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని ఫిర్యాదు

సామర్లకోట: తనతో సహజీవనం చేసిన వ్యక్తి వల్ల ప్రాణహాని ఉందని హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన ఓ మహిళ ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సామర్లకోటకు చెందిన బి.సత్తిబాబు తనతో సుమారు 20 ఏళ్లు సహజీవనం చేశాడని, ప్రస్తుతం తనకు సంబంధం లేదని బెదిరిస్తున్నాడని, న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎ.కృష్ణభగవాన్ తెలిపారు.

నిబంధనలు పాటించాలి

కొత్తపల్లి: శరన్నవరాత్ర ఉత్సవాల్లో కమిటీ సభ్యులు నిబంధనలను తప్పని సరిగా పాటించాలని ఎస్సై వెంకటేష్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అమ్మవారి విగ్రహాల నిమజ్జనానికి సంబంధించి కోనపాపపేట - ఉప్పాడ శివారు సుబ్బంపేట సమీపంలోని రెండు ప్రాంతాల్లో అనుమతి ఉందన్నారు. పూర్తి స్థాయిలో పోలీసుల పర్యవేక్షణలో నిమజ్జనానికి సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో ఎటువంటి అశ్లీల నృత్యాలు ఉండదన్నారు.

తినబోతే టాప్‌కార్న్



నగరంలోని థియేటర్‌లో ఐస్‌క్రీమ్స్ రేట్లు



భానుగుడి సెంటర్‌లోని ఓ థియేటర్‌లో సమోసా, వెజ్, ఎగ్ పఫ్ ధరల పట్టీ

- థియేటర్లలో తినుబండారాలు సెప'రేటు'
- విరామ సమయంలో తింటే జేబులు గుల్లే
- ఇదీ నగరంలో సినిమా హాళ్లలో పరిస్థితి

బోట్‌క్లబ్: పాప్‌కార్న్.. 'టాప్'కార్న్ అయ్యింది.. కూల్ డ్రింక్ తాగాలంటే ధర దడ పుట్టిస్తోంది.. ఉల్లి సమోసా అది'రేట్' ఉంది.. ఇలా ఏం కొనలేం.. ఏం తినలేం.. అన్నట్లుంది సినిమా థియేటర్లలో తినుబండారాల పరిస్థితి. తమకు ఇష్టమైన హీరో సినిమాకు వెళ్తే అభిమానుల జేబులు గుల్లవుతున్నాయి. సినిమా విరామంలో తినుబండారాలు కొందామని వెళ్లే ప్రేక్షకులకు రేట్లు చూసి గుండెలదురుతున్నాయి. బయట మార్కెట్‌లో ధరలకు ఇక్కడ ధరలకు భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. సినిమా విరామంలో కూల్ డ్రింక్స్, సమోసా, పాప్‌కార్న్, వెజ్, ఎగ్ పఫ్‌లు, ఉల్లి సమోసా, ఐస్ క్రీమ్, కోల్డ్ కాఫీ విత్ ఐస్‌క్రీమ్ వంటి తినుబండారాలు బయట మార్కెట్‌లో కంటే రెండు రెట్ల ధరకు విక్రయిస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే ఇక్కడ ధరలు ఇలానే ఉంటాయని థియేటర్ సిబ్బంది రుబాబుగా చెబుతున్నారని ప్రేక్షకులు అంటున్నారు. కాకినాడ నగరంలో మొత్తం 13 సినిమా థియేటర్లు ఉన్నాయి. దాదాపు సగానికి పైగా థియేటర్లలో ఇదే పరిస్థితి ఉంది. ఇక్కడ తినుబండారాల ధరలు ఎక్కువగా ఉన్నాయని బయట కొనుగోలు చేద్దామని వెళ్తుంటే థియేటర్ ఇబ్బంది అడ్డుపడుతున్నారని ప్రేక్షకులు గగ్గోలు పెడుతున్నారు. థియేటర్‌లోకి ఏమీ తీసుకెళ్లకుండా అక్కడ చెకింగ్ చేసి మరీ లోపలకు పంపుతున్నారు. ఇక మల్టీప్లెక్స్ థియేటర్‌లో అయితే అసలు ప్రేక్షకులు ఏమీ పట్టుకెళ్లకుండా అక్కడ సిబ్బంది నియంత్రిస్తున్నారు. మన దగ్గర ఉన్న బ్యాగ్‌లు, ఇతర సామాన్లు అక్కడ లాకర్‌లో పెట్టాల్సిన పరిస్థితి ఉంటుంది. దీంతో చేసేది లేక కుటుంబ సభ్యులతో సినిమాకు వెళ్లి ఏమైనా తినాలంటే జేబులు గుల్ల చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఇంత జరుగుతున్నా అధికారులెవరూ తమకు పట్టనట్టు

తినుబండారం	బయట మార్కెట్	థియేటర్లలో..
ఐస్‌క్రీమ్	రూ. 20	రూ. 50
కోల్డ్‌కాఫీ విత్ ఐస్‌క్రీమ్	రూ. 40	రూ. 80
వెజ్‌పఫ్	రూ.8	రూ. 20
ఎగ్‌పఫ్	రూ. 15	రూ.30
ఉల్లి సమోసా	రూ. 8	రూ. 15
కూల్ డ్రింక్	రూ. 10	రూ. 20

వ్యవహరిస్తున్నారు. రెవెన్యూ అధికారులు ఎవరైనా సినిమాకు వస్తే వారికి సినిమా థియేటర్ యాజమాన్యం రాచమర్యాదలు చేయడంతో, వారు ఇక్కడ ఏం జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

ఆ ఆనందం ఆవిరి

కొత్త సినిమా వచ్చిందంటే చాలు థియేటర్ యజమానులు అధిక ధరలకు టిక్కెట్లు విక్రయించే పద్ధతికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం స్వస్తి పలికింది. దీంతో చిన్న, మధ్య తరగతి ప్రజలు కూడా కుటుంబంతో సహా థియేటర్‌కు వచ్చి సినిమా చూసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ టిక్కెట్ ధరలు అమాంతం పెంచడంతో ప్రేక్షకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిని చూసి అంతా ఆందోళన చెందుతున్నారు. ఇదెక్కడి విధానమని అంటున్నారు.

ఇదేమి దారుణం



ఇటీవల నా భార్య, ఇద్దరు పిల్లలతో కలసి ఓ సినిమాకు వెళితే టిక్కెట్లకు రూ. 800 ఖర్చయ్యింది. సినిమా విరామ సమయంలో డ్రింక్, సమోసా, పాప్‌కార్న్ కొనుగోలు చేస్తే రూ. 350 తీసుకున్నారు. ఇదేమి దారుణం. ఇవే బయట మార్కెట్‌లో కొనుగోలు చేస్తే రూ. 150 అవుతుంది. అధికారులు ధరల నియంత్రణపై దృష్టి సారించాలి.

–జి.స్వామి, ప్రేక్షకుడు

నాణ్యతా తక్కువే..



బయట తినుబండారాలు థియేటర్‌లోకి తీసుకు వెళ్లకుండా అడ్డుకోవడం దారుణం. థియేటర్లలో తినుబండారాలు కూడా పెద్ద నాణ్యతగా ఉండడం లేదు. కానీ రేట్లు ఎక్కువగా తీసుకొంటున్నారు. సినిమాకు వెళితే విరామ సమయంలో ఏదొకటి తినకుండా ఉండలేం. పిల్లలు మారం చేయడంతో ఏదొకటి కొనాలి. ఇదే అదునుగా భావించి థియేటర్ యాజమాన్యాలు ప్రేక్షకుల నుంచి అధిక డబ్బులు వసూలు చేస్తున్నారు.

–దొరబాబు, ప్రేక్షకుడు

ఉపాధ్యాయుల పాత్ర కీలకం



అభినందన సభలో మాట్లాడుతున్న ఆర్జేడీ నాగమణి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): స్థానిక శ్రీనగర్ ఆదిత్య అకాడమీలో ఆదివారం డీఎస్సీ–25 విజేతలకు సత్కార సభ నిర్వహించారు. కాంపిటేటివ్ విభాగ డైరెక్టర్ డీఎస్ గణేష్ అధ్యక్షతన నిర్వహించిన సభలో పాఠశాల ఆర్జేడీ నాగమణి హాజరై మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులు కృషి చేయాలని, ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎదిగి మంచి పేరు సంపాదించాలని సూచించారు. ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సత్కరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాకినాడ క్రైం: కాకినాడకు చెందిన ఓ వ్యక్తి రైలు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మృతి చెందాడు. రేచర్లపేటకు చెందిన కంచుమర్తి దినకర్ (32) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. భార్యతో మనస్పర్థల కారణంగా మూడేళ్లుగా ఆమెకు దూరంగా ఉంటున్నాడు. శనివారం రాత్రి రేచర్లపేట సమీపంలో రైలు పట్టాలు దాటుతూ ప్రమాదానికి గురయ్యాడు. తీవ్ర గాయాల పాలవ్వగా స్థానికులు గమనించి కాకినాడ జీజీహెచ్‌లో చేర్చారు. చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. కాకినాడ జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేశారు.

హిందూ ధర్మానికి ప్రతిరూపం బొమ్మల కొలువు



ఆకట్టుకున్న బొమ్మల కొలువు

బోట్‌క్లబ్: దసరా ఉత్సవాల సందర్భంగా బొమ్మలు కొలువు నిర్వహించడం ద్వారా హిందూ ధర్మంలోని విశేషాలను నేటి తరానికి సజీవంగా చూపించవచ్చని వేద పండితుడు యాతగిరి మద్వేష్ అన్నారు. స్థానిక ప్రగతి కాలేజీ సమీపాన మనోజ్ఞ మనోహర్ స్వగృహంలో ఏర్పాటు చేసిన దసరా బొమ్మల కొలువును ఆయన సందర్శించారు. బొమ్మల కొలువు ద్వారా అనేక ఆధ్యాత్మిక విషయాలు పిల్లలకు వివరించడం అద్భుతమన్నారు. మనోహర్ మాట్లాడుతూ పండరీపురం క్షేత్రాన్ని, దాని పరిసరాలలో ఉన్న మధ్వమత గురువుల విశేషాలతోపాటు, శ్రీపాండురంగ స్వామి భక్తుల విశేషాలను ప్రతిబింబించే విధంగా బొమ్మలు ఏర్పాటు చేశామన్నారు. పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వడమే కాక, గ్రామీణ వాతావరణం చూసేలా ధాన్యంతో కూడిన ఎడ్ల నమూనాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ బొమ్మలు కొలువును చూసి వాటిలోనే విశేషాలను తెలుసుకుంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు.

భగత్‌సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలి



పెద్దాపురంలో భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పెద్దాపురం: స్వాతంత్ర్య పోరాట యోధుడు భగత్ సింగ్, సామాజిక రచయిత, కవి కోకిల గుర్రం జాషువాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు జోషుల కృష్ణబాబు పిలుపునిచ్చారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నువ్వుల గుంట వీధి భగత్‌సింగ్ విగ్రహం వద్ద భగత్‌సింగ్ జయంతి, స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనం వద్ద జాషువా జయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో మహానుభావులు దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను త్యాగం చేశారన్నారు. ఆ కోవలోనే భగత్‌సింగ్ యువతలో స్ఫూర్తిని నింపారన్నారు. సామాజిక అసమానతలను పారద్రోలేందుకు కవి జాషువా ప్రయత్నించారన్నారు. ఆయన రచించిన అనేక ఖండ కావ్యాలు, పద్యాలు, కవితలు నేటికీ చిరస్థాయిగా నిలిచాయన్నారు. భగత్‌సింగ్ విగ్రహానికి, జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఎస్ఎం నాయకులు రొంగల వీర్రాజు, దారపురెడ్డి కృష్ణ, సత్యనారాయణ, బంగార్రాజు, గూనిరి రమణ, వడ్డి సత్యనారాయణ, కూనిరెడ్డి అప్పన్న, సిరిపురపు శ్రీనివాస్, పీసీసీ అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ, అనూష అంజలి, జశ్వంత, నాని పవన్, కుమార్, మణికంఠ, బంగారం, సందీప్, హర్ష, చల్లా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే బలం.. బలగం

- వారికి వెన్నుదన్నుగా ఉండేందుకు 'డిజిటల్ బుక్'
- ఆవిష్కరణ సభలో మాజీ మంత్రి కురసాల కన్నబాబు



డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి కన్నబాబు, శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీకి కార్యకర్తలే బలం.. బలగమని, వారికి అన్ని వేళలా అండగా ఉంటామని మాజీ మంత్రి, పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్, కాకినాడ రూరల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రమణయ్యపేట వైద్యనగర్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఉదయం డిజిటల్ బుక్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తోందని, చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ పాలన ప్రజలను పీడించడానికి, వైఎస్సార్ సీపీని అణగదొక్కడానికి అన్నట్లు సాగుతోందని అన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. కార్యకర్తలకు వెన్నుదన్నుగా ఉండేందుకే డిజిటల్ బుక్, క్యూఆర్ కోడ్‌ను, ఐవీఆర్ఎస్ నంబరును వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తీసుకు వచ్చారని చెప్పారు. కూటమి ప్రభుత్వంలోని నాయకులు, అధికారుల వల్ల ఇబ్బందులు పడే వైఎస్సార్ సీపీ కార్యకర్తలు జరిగిన అరాచకాన్ని డిజిటల్ బుక్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యకర్తలను బాధించిన వారిని జగన్ 2.0 అధికారంలోకి వచ్చిన తరువాత విడిచిపెట్టేది లేదని హెచ్చరించారు. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు యువగళమని లోకేష్ ఊరూవాడా తిరిగారని, అప్పుడు రెడ్‌బుక్ చూపించి ఇందులో పేర్లున్నాయని, అధికారంలోకి వచ్చిన తరువాత మీ పని చెబుతామంటూ ఆ రోజే బెదింపులు మొదలుపెడితే తండ్రి చంద్రబాబు వంత పాడారని గుర్తు చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన అనంతరం సాధారణ కార్యకర్తల నుంచి నాయకుల వరకూ అందరిపై కేసులు పెట్టడం, జైలుకు పంపడం చేస్తున్నారన్నారు. సోషల్ మీడియాలో ఎప్పుడో పోస్టులు పెట్టారని వేధింపులకు పాల్పడుతున్నారు.

పోలీసు వ్యవస్థ దుర్వినియోగం

కూటమి ప్రభుత్వం పోలీసులను ప్రధాన ఆయుధంగా వాడుతూ ఆ వ్యవస్థను దుర్వినియోగం చేస్తోందని కన్నబాబు ఆరోపించారు. పోలీసులు ఎందుకు తగ్గి పని చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. హైకోర్టు కూడా వారి పని తీరును తప్పు పట్టిందని గుర్తు చేశారు. ఈ పరిస్థితుల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను కాపాడుకునేందుకు తమ నాయకుడు జగన్ టెక్నాలజీ వాడుతూ డిజిటల్ బుక్ తీసుకు వచ్చారన్నారు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయవచ్చని, పార్టీ కార్యకర్తలు భయపడవద్దని కన్నబాబు అన్నారు. ఇప్పుడు జరుగుతున్న అన్యాయాలను అందులో నమోదు చేస్తామన్నారు. ముఖ్య అతిథిగా శ్రీకాకుళం జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ విజయ పాల్గొన్న ఈ కార్యక్రమంలో కాకినాడ రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి, సర్పంచ్‌లు బెజవాడ సత్యనారాయణ, రామదేవు సూర్యప్రకాశరావు, సీనియర్ నాయకులు గోపుశెట్టి బాబ్జి, మాకినీడి శేషుకుమారి, పెదపాటి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

బోరు నీరు.. వృథా తీరు



బలుసులపేటలో రోడ్డుపైకి విడిచి పెడుతున్న బోరు నీరు

సామర్లకోట: గొంతు తడాల్సిన నీరు వృథా అవుతోంది.. అధికారుల నిర్లక్ష్యం కారణంగా జలం రోడ్డెక్కుతోంది.. స్థానిక నీలమ్మ చెరువు గట్టుపై ఉన్న బోరు నీటిని టెస్టింగ్ పేరుతో బలుసులపేట రోడ్డుపై విడిచి పెడుతున్నారు. దీనితో అటుగా వెళ్లేవారు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డుపైకి విడిచి పెట్టే నీటిని నీలమ్మ చెరువులోకి ఎందుకు విడవడం లేదని 13వ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ డీఈ దృష్టికి తీసుకు వెళ్లినా స్పందన లేదని అన్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సింహారోహిణి.. పాపహారిణి

- వైభవంగా శరన్నవరాత్ర ఉత్సవాలు
- ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు



కాకినాడ బాలాత్రిపుర సుందరీదేవి ఆలయంలో దర్శనం కోసం క్యూలో భక్తులు

కరప: శక్తి రూపిణిలా.. సుమధుర హాసినిలా కొలువుదీరిన ఆ కనక దుర్గమ్మను భక్తులు కొలిచారు. శరన్నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని ఆ జగన్మాత వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. కరప శివాలయంలోని పర్వతవర్ధినీదేవి అమ్మవారు సింహారోహిణి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, అర్చకుడు కొంపెల్ల చక్రధర్ పూజాదికాలు నిర్వహించారు. వేకువ జాము నుంచే మహిళలు అధిక సంఖ్యలో తరలి వచ్చి కుంకుమ పూజ చేయించుకున్నారు. కరప చింతపల్లిరోడ్డులోని విజయదుర్గమ్మ ఆలయంలో దుర్గాదేవికి పూజాదికాలు నిర్వహించి, ఆటో యూనియన్ ప్రసాద వితరణ చేశారు. యండమూరులోని సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రధానార్చకుడు పెద్దింటి సీతారామం విశేష పూజలు చేశారు. మండలంలోని కరప, నడకుదురు, పెనుగుదురు, పాతర్లగడ్డ, గొర్రిపూడి, కొంగోడు, యండమూరు, వేళంగి, కూరాడ, వాకాడ, వేములవాడ, వలసపాకల, కొరిపల్లి, జెడ్. భావారం, గొడ్డటిపాలెం, అరట్లకట్ట గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో అభిషేకాలు నిర్వహించారు.

కాకినాడ రూరల్: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు కాకినాడ రూరల్ రమణయ్యపేటలోని శ్రీపీఠంలో ఐశ్వర్యాంబిక అమ్మవారు భక్తులకు వారాహీ దేవిగా దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. రమణయ్యపేట ఏపీఎస్పీ వద్ద హ్రీం పీఠంలో శ్రీలలితా పరమేశ్వరి అమ్మవారు కాత్యాయనిగా అలంకృతులయ్యారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

బోట్‌క్లబ్: దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు వివిధ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కాకినాడ బాలాత్రిపుర సుందరి ఆలయంలో అమ్మవారు సింహారోహిణిగా అలంకృతులయ్యారు. సాయంత్రం నుంచి అధిక సంఖ్యలో భక్తులు రావడంతో క్యూలు నిండిపోయాయి. రూ. 50, రూ. 30 దర్శనాలతో పాటు, ఉచిత క్యూలో గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. అమ్మవారిని మాజీ కేంద్ర మంత్రి పళ్లంరాజు దర్శించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విశ్వనాథ రాజ్యలక్ష్మి బృందం నృత్య ప్రదర్శన అలరించింది. అనంతరం ఈశాఫైన్ ఆర్ట్స్ వారిచే నాట్య ప్రదర్శన, భగవతి నృత్యాంజలి నృత్య ప్రదర్శన, జగన్మాత నాట్యాలయం వారి కూచిపూడి నృత్యం భక్తులను రంజింపజేసింది. స్థానిక దేవాలయం వీధిలో బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు కాళికాదేవిగా దర్శనమిచ్చారు. మధ్యాహ్నం ఆలయంలో అన్నసమారాధన నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు ఏర్పాట్లు చేశారు. అశోక్ నగర్ సాయిబాబా ఆలయంలో చండీ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వేదుల అచ్యుత రామారావు పాల్గొన్నారు. భానుగుడి భానులింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు మహాచండీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



కరప శివాలయంలో సింహారోహిణి అవతారంలో పర్వతవర్ధినీదేవి



రమణయ్యపేట శ్రీపీఠంలో వారాహీదేవిగా ఐశ్వర్యాంబిక



రమణయ్యపేట హ్రీం పీఠంలో కాత్యాయనిగా..



సూర్యారావుపేటలో సింహారోహిణిగా బాలాత్రిపుర సుందరి అమ్మవారు



దేవాలయం వీధిలో భీమేశ్వర స్వామివారి ఆలయంలో కాళికాదేవిగా..



భానులింగేశ్వర స్వామి ఆలయంలో మహా చండీదేవిగా..